




హెల్మెట్లు పంపిణీ



ప్రజాశక్తి-నెల్లూరు : ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ధాతృత్వంతో 30 మంది ట్రాఫిక్ పోలీసులకు ఎసి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఆదివారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌పి డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డిలు ట్రాఫిక్ పోలీసులకు ఎసి హెల్మెట్లను అందజేశారు. ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు తమ విధి నిర్వహణలో ఎండలో నిలబడి దుమ్ము, ధూళి లెక్కచేయకుండా పనిచేస్తుంటారన్నారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఉపశమనం కల్గించేందుకు నాణ్యమైన, విలువైన ఎసి హెల్మెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పోలీసు శాఖకు ఎటువంటి తోడ్పాటు అందించడానికైనా తాను సిద్ధమని తెలిపారు. అనంతరం ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎంపి దాతృత్వానికి పోలీసు శాఖ నుంచి ధన్యవాదాలు తెలిపారు.

'అమ్మఒడి' అంతేనా.. అంతేనా..!

లబ్ధిదారుల ఎదురుచూపులు -అంతా అయోమయం..

అమ్మ ఒడి మూడేళ్ల ముచ్చటిగానే మిగిలిపోయినట్లు ఉంది. 2019 ఎన్నికల సమయంలో ఎంతో ఆర్భాటంగా ఇంట్లో చదువుకునే అందరు పిల్లలకు ఇస్తామన్నారు.. ఇంట్లో ఒక్కరికేనన్నారు... 300 యూనిట్ విద్యుత్ వాడకమన్నారు... నాలుగు చక్రాల వాహనం అన్నారు...పట్టణంలో వెయ్యి గజాల ఇంటి స్థలాలన్నారు. ఇప్పుడు ఏకంగా కొందరికి నిలుపుదల చేశారు. ఎందుకు చేశారో ఎవ్వరికీ తెలియడం లేదు. విద్యాశాఖకు సమాచారం లేదు. గ్రామ సచివాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తంగా కొందరికి ఎగనామం పెట్టేశారు. ప్రభుత్వం వద్ద నగదు లేకపోవడంతో జిల్లాలో ఈ ఏడాది 5,324 మందికి అందలేదు. అదిగో, ఇదిగో అంటూ ఊరిస్తున్నారు. ఈ సమయం దాటితే మళ్లీ ఎన్నికల సంవత్సరంలో పడిపోవడంతో ఇక అంతేగా అంతేగా అంటున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అమ్మఒడి పథకం ప్రతేడాది బలహీనపడుతోంది. రోజుకో నిబంధనలు పెట్టి, కోతలు పెడుతున్నారు. ఓవైపు ఫీజులు , ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ అమ్మఒడి ఇస్తామన్నారు. గెలిచిన తర్వాత మాట మార్చేశారు. తొలి ఏడాది ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇచ్చారు. తర్వాత దానిని రూ.13 వేలకు తగ్గించారు. తొలి ఏడాది రూ.330 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది దానిని రూ.292 కోట్లకు తగ్గించారు. సుమారు రూ.38 కోట్లు తగ్గించారు.



విద్యార్థులకు రూ.200 కోట్లు ఇచ్చారు.300 యూనిట్ కరెంట్ వాడకంతోపాటు, నాలుగు చక్రాల వాహనం, నగరంలో వెయ్యి గజాల ఇంటి స్థలం అంటూ పెండింగ్ పెట్టారు. గతంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అమ్మఒడి పథకాన్ని పరిశీలిస్తుండగా దానిని గ్రామ సచివాలయాలకు బదిలీ చేశారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కెవైసి తీసుకున్నారు. అమ్మఒడి పథకం వస్తుందని చెప్పారు. ఈ ఏడాది విద్యాశాఖకు ఎలాంటి ప్రమేయమూ లేకుండా సచివాలయ పరిధిలోనే అమ్మఒడి సాగుతోంది.. అమ్మఒడి పథకాన్ని నీరు గార్చుతున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పథకాన్ని రకరకాల నిబంధనలతో తగ్గిస్తున్నారు. 2019-20 ఏడాదిలో కుటుంబానికి ఒక్కరికే ఇస్తామంటూ మెలికపెట్టారు. జిల్లా వ్యాపితంగా 2.20 లక్షల మంది విద్యార్థులకు అ ఏడాది రూ.330 కోట్లు నిధులు విడుదల చేశారు. 2020-21 సంవత్సరంలో 2.43 లక్షల మంది విద్యార్థులకు రూ.365 కోట్లు విడుదల చేశారు. 2021-22లో కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. రెండు లక్షల మంది

2022-23 సంబంధించి 1.94 లక్షల మంది విద్యార్థులకు రూ.292 కోట్లు జమచేశారు. రాత్రికే అందరి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. ఈ ఏడాది సుమారు 5,324 మంది అమ్మఒడి నుంచి తగ్గించారు. కారణాలు తెలియకపోయినా ఇదిగో అదిగో అంటూ మభ్యపెడు తున్నారు. 20 రోజులుగా తల్లిదండ్రులు సచి వాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. మళ్లీ పత్రం అందజేస్తే చూస్తామని చెబుతున్నారు. వారం పదిరోజుల్లో నగదు పడుతుందని చెప్పినా ఇప్పటి వరకు అతిగతి లేదు. వచ్చే అవకాశాలు కనిపించడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో కొందరిని తొలగించారని తెలుస్తోంది. తమకు అమ్మఒడి ఎందుకుపడలేదో తెలియ తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని అడగాలో తెలియక తికమక పడుతున్నారు. అమ్మఒడికి ఎవరు బాద్యులనే విషయం తెలియడం లేదు. వచ్చే ఏడాదికి ఎన్నికలు రానుండడంతో మళ్లీ అమ్మఒడి వచ్చే అవకాశాల లేవని తెలుస్తోంది. అమ్మఒడి తగ్గించంపై డిఇఒను అడగగా తనకు ఏమీ తెలి యదని, ఎలాంటి సమాచారం తమ వద్ద లేదని, అంతా సచివాయాల పరిధిలోనే సాగుతుందని చెప్పారు.

ఎప్పుడిస్తారో తెలియదు..
-వలంటీర్

ప్రభుత్వం కొందరికి అమ్మ ఒడి నిలుపుదల చేసింది. సచివాలయం వచ్చి ధరఖాస్తు చేసుకోవాలని, ఎప్పుడైనా వస్తాయని తెలుస్తోంది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతున్నారు. మాకు ఎవరు సమాచారం ఇవ్వడం లేదు. అందరూ మా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మేం సమాధానం చెప్పలేకపోతున్నాం..

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని పోట్లూరు - తెట్టు మధ్య రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఉన్న వన్యప్రాణి దుప్పి రాత్రి సమయంలో ఆర్ అండ్ బి రోడ్ లోకి రావడంతో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందింది. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. కొందరు వాహన సాధకులు అటవీ శాఖ అధికారులకు సమాచారం పంపడంతో దుప్పి శవాన్ని స్వాధీనం చేసుకొని అడవిలోనే పోస్ట్‌మార్టం నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



'యువగళం' దెబ్బకు

వైసిపి ప్యాకప్ ఖాయం..!

వలేటివారిపాలెం బహిరంగ సభలో నారా లోకేష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, వేదికపై నారా లోకేష్

ప్రజాశక్తి - లింగసముద్రం

యువగళం దెబ్బకు వైసిపి ప్యాకప్ చేయడం ఖాయమని, జగన్ ప్రతి స్కీమ్ వెనుక స్కామ్ ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. 156 రోజు యువగళం పాదయాత్ర ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని లింగసముద్రం మండలం, వెంగళాపురం నుంచి ప్రారంభమైంది. అనంతరం వలేటివారిపాలెం మండలంలోకి ప్రవేశించింది. వలేటివారిపాలెం మండల కేంద్రంలో టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన భారీ బహిరంగ సభలో నారా లోకేష్ మాట్లాడారు. బహిరంగ సభకు వచ్చిన జనాన్ని చూసి చిత్తూరు జనసంద్రంగా మారింది, అనంతపురం అదిరిపోయింది.. కర్నూలు కదం తొక్కింది.. నెల్లూరు నాటు దెబ్బ వైసిపికి దిమ్మతిరిగింది.. ప్రకాశం పోటెత్తింది.. అని లోకేష్ అన్నారు. జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకం గురించి వాళ్ల మంత్రులు మాట్లాడుతూ అది ప్రజల పాలిట శని అని అన్నారని చెప్పారు.వలంటీర్లను పెట్టి ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారని, డేటా దొంగ జగన్ 'మీ ఇంట్లోకే వచ్చేశాడు.. జాగ్రత్త .. మీ వ్యక్తిగత సమాచారం ఇస్తే మీకు ఉన్న ఆస్తులను కొట్టేయడం ఖాయమని చెప్పారు. జగన్‌ది పిల్ల కాలువ రేంజ్, చంద్రబాబుది పోలవరం రేంజ్.. చంద్రబాబు పోలవరం పనులు పరుగులు పెట్టించి 72శాతం పనులు పూర్తి చేస్తే, జగన్ కమీషన్ల కక్కుర్తితో రివర్స్ టెండరింగ్ పెట్టి ప్రాజెక్టును ప్రమాదంలో పడేశాడని విమర్శించారు. తన సొంత ప్రయోజనాల కోసం జగన్ ఢిల్లీ చుట్టూ తిరుగుతూ కేసుల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదన్నారు. జగన్‌కు రెండు బటన్లు ఉంటాయని.. ఒకటి బ్లూ బటన్.. రెండోది రెడ్ బటన్ అని.. బ్లూ బటన్ నొక్కగానే మీ అకౌంట్లోకి 10 వస్తే రెడ్ బటన్ నొక్కగానే మీ అకౌంట్ నుంచి రూ. 100 కట్ అవుతాయని ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటి వరకు 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఆర్టీసి ఛార్జీలు మూడు సార్లు.. పెంచారన్నారు. ఇంటి పన్ను,చెత్త పన్ను నిత్యవసర సరుకులు, గ్యాస్,పెట్రోల్,డీజిల్ రేట్లు పెంపోయారన్నారు. బీసీలను, మైనార్టీలను ,దళితులను టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చాలా పథకాలను వైసిపి ప్రభుత్వం తొలగించింది అని. టిడిపి తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకొస్తామని హామీ ఇచ్చారు. 2వేల కిలోమీటర్లు నడిచిన సమయంలో ప్రజల కష్టాలను చూసానన్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో అనేక ప్రకటించామన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువకు టిడిపి ప్రభుత్వ 38 కోట్లు మంజూరు చేస్తే ఈ చేతగాని ప్రభుత్వం పనులు పూర్తి చేయలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పొడిగింపు పనులు పూర్తి చేస్తామన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధి చేస్తామన్నారు. గుండ్లకమ్మప్రాజెక్టును నాశనం చేశారన్నారు. కందుకూరుకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు.కందుకూరులో టిడిపిని గెలిపించండి.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కందుకూరును ప్రకాశంలో కలుపుతామని హామీనిచ్చారు.. పేపర్ పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. కందుకూరును మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. మామిడి,సపోట రైతులకు మార్కెటింగ్ అవకాశం తో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. టిడిపి నాయకులను,కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించిన ఎవ్వరినీ వదిలి పెట్టనని వడ్డీతో సహ చెల్లిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ దివి శివరాం,పోతుల రామారావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీ, మాజీ ఎంపి శ్రీరాం మాల్యాద్రి, దామచర్ల సత్య, ఇంటూరి రాజేష్, ఎంఎం కొండయ్య, ఎరిక్షన్‌బాబు ఉన్నారు.



బహిరంగ సభకు హాజరైన జనం

18న 'చలో డిఎంహెచ్ఓ'

ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-నెల్లూరు : ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, యాప్‌ల పేరుతో ఆన్‌లైన్‌లో పనిచేయాలంటూ ఆశా వర్కర్లపై పని ఒత్తిడి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఈ నెల 18న ఛలో డిఎం అండ్‌హెచ్ఓ కార్యక్రమాలకు పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. కరప్రతాలు ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడారు. ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. వారి సమస్యల పరిష్కారం కోరుతూ ఛలో డిఎంఅండ్‌హెచ్ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా ములుమూడి బస్టాండ్ ప్రాంతం నుంచి ఆశా వర్కర్స్ భారీ ప్రదర్శనగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చేరుకొని అనంతరం ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్స్ పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం 50 ఇళ్ళకు ఒక వాలంటీర్‌ను నియమించి వారికి ఇస్తున్న గౌరవం వేల మందికి వైద్య ఆరోగ్యసేవలందించడంలో కీలక భూమికను పోషిస్తున్న ఆశాలకు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం తాము చేస్తున్న ధర్నాకు జిల్లాలోని ఆశా వర్కర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, భ్యాగరేఖ, రేవతి, మధుసూధన పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడ్లూరు : స్థానిక ఎంఎస్‌ఆర్ గిరిజన కాలనీలో జగనన్న కాలనీలో నీటి సమస్య, విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపాలని గుడ్లూరు మండల సిపిఎం శాఖ డిమాండ్ చేసింది. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సిపిఎం కార్యదర్శి కె వెంకయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంఎస్‌ఆర్ జగనన్న కాలనీలో పేరుకు పోయిన సమస్యలపై ఆదివారం చర్చ జరిగింది. ఎం ఎస్‌ఆర్ గిరిజన కాలనీలో స్థిరనివాసం కలిగి ఉన్న 70 కుటుంబాలకు చెందిన యానాదులకి తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. విద్యుత్ దీపాలు లేక అంధకారంలో అవస్థలు పడుతున్నారని, కాలనీ పక్కనే నివాసమున్న నిరుపేద కుటుంబాల వారికి ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పక్కనే ఉన్న జగనన్న కాలనీలో నీరు విద్యుత్ లేనందున ఇళ్ల స్థలాల్లో ఇల్లు కట్టుకోలేక నీటి కోసం ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. జగనన్న కాలనీలో పేరుకుపోయిన సమస్యలు ఇప్పటికైనా పరిష్కారం చేయాలని సిపిఎం మండల శాఖ తీర్మానించింది. 18వ తేదీని గుడ్లూరు కి వస్తున్న మహిళా సభ్యులకి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు తెలియజేశారు. గుడ్లూరులో శాశ్వత పార్టీ ఆఫీసు నిర్మాణం కోసం కషి చేయాలని సభ్యుల్ని కోరారు. ఈ సీనియర్ సిపిఎం నాయకులు మద్దిశెట్టి జాలయ్య, సిపిఎం కార్యదర్శులు కే వెంకయ్య, జి మల్లికార్జున, నాయకురాలు ఎస్ విజ యలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు ఎస్ కే ఖాదర్బాషా, పోట్లూరు రామ చంద్రయ్య, రైతు సంఘం నాయకులు దామా కష్ణయ్య, కొమరగిరి అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రిటైల్ అవుట్‌లెట్ ప్రారంభం

నెల్లూరు : పెరిగిన నిత్యావసర ధరల భారాన్ని ప్రజలపై తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం రిటైల్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు ఆదివారం నగరంలోని నవాబుపేట రైతు బజార్లో ఏర్పాటుచేసిన రిటైల్ అవుట్లెట్ ను జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు.జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీతో నిత్యవసర సరుకులు ప్రజలకు అందించే విధంగా రైతు బజార్ లలో ప్రత్యేక రిటైల్ కౌంటర్ లు ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. నవాబు పేట, ఫత్తేఖాన్ పేట రైతు బజార్లలో, కావలి, కందుకూరులో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

మద్యం.. మాదక ద్రవాల్యను నిషేధించాలి

'ఐద్వా' మహిళా పోరు యాత్ర ప్రారంభం



నెల్లూరు నగరంలో..

ప్రజాశక్తి-నెల్లూరు : మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరుతూ ఐద్వా నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మహిళా పోరు యాత్రను ప్రారంభించారు. ఈ పోరు యాత్ర జిల్లాలో మూడు రోజుల పాటు జరగనుంది. తొలి రోజు 53వ డివిజన్‌లోని వెంకటేశ్వరపురం ప్రారంభమైన ఈ పోరు యాత్ర శెట్టిగుంట రోడ్డు, బొల్లినేని సెంటర్, విఎంఆర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, ముత్తుకూరు గేటు సెంటర్, టిపి గూడూరు, భగత్ సింగ్ కాలనీ,జనార్ధన్‌రెడ్డి కాలనీ, పూలే విగ్రహం వరకు సాగింది. తొలుత వెంకటేశ్వరపురం సెంటర్‌లో యాత్రను సీనియర్ ఐద్వా నాయకురాలు జక్కా శేషమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం మత్తు పదార్థాల ద్వారా జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. మద్యపాన నిషేదం అమలు చేయాలంటూ మహిళలు గడిచిన 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే సంపూర్ణ మద్యపాన నిషేదం అమలు చేశారన్నారు. తర్వాత సిఎం అయిన నారాచంద్రబాబు నాయుడు మద్యపాన నిషేధానికి తూట్లు పోడిచారన్నారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేదం అమలు చేస్తామంటూ ఆర్భాటంగా హామీలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరించారన్నారు. మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకుంటుందని విమర్శించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ. కేవలం మద్యం, మత్తు పదార్థాలను, నిషేధించాలని ప్రధాన అజెండాగా జిల్లా వ్యాప్తంగా ఈ పోరు యాత్ర సాగుతుందన్నారు. మహిళలను చైతన్యవంతం చేయడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు షేక్ మున్వర్ సుల్తానా, షేక్ శంషాద్ బేగం, కత్తి పద్మ, ఎం ప్రమీల, సుబ్బమ్మ ప్రజా నాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఐద్వా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో..

మద్యం విక్రయాలను నిలిపివేయాలని, మాదక ద్రవ్యాలను అరికట్టాలిని ఐద్వా రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. ఐద్వా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో బొల్లినేని సెంటర్‌లో మహిళా పోరు యాత్రను ప్రారంభించాచరు. ఈ యాత్ర వి.ఎం.ఆర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య నగర్,ముత్తుకూరుగేట్ సెంటర్ వరకు నిర్వహించారు. ఐద్వా రూరల్ కమిటీ నాయకులు ప్రధాన కూడళ్ల వద్ద మాట్లాడారు. యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుం టుందన్నారు. ఎన్నికల సమయంలో వైసిపి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్యపాన నిషేదం అమలు చేస్తామంటూ చేసిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాదకద్రవ్యాలు,అశ్లీల వెబ్ సైట్లు ను నియంత్రించాలని రూరల్ ఐద్వా కార్యదర్శి షేక్ షాహినాబేగం డిమాండ్ చేశారు. జిల్లా ఐద్వా కార్యదర్శి షేక్ మస్తాన్ బి, అధ్యక్షులు పి శివకుమారి, రూరల్ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మీ నగర కార్యదర్శి కె పద్మా సీనియర్ నాయ కురాలు అరిగెల రమమ్మ, సుజాతమ్మ, ఇందిరమ్మ, షేక్ షంషాద్, ఎస్ శ్యామ లమ్మ, ఎం ప్రమీల ,షేక్ జాకిరా, మహాలక్ష్మమ్మ షేక్,పర్విన్ జానకి ,డికేడబ్లు విశ్రాంత లెక్చరర్ భారతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, విజయ్ కుమార్, పెంచలయ్య, గంగాధర్ తదితర కళాకారులు పాల్గొని అభ్యుదయ గీతాలు ఆలపించారు.



రూరల్ నియోజకవర్గంలో..

లోకేష్‌కు అంకభూపాలపురం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామస్తులు యువనేత లోకేష్ ను కలిసి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలో ఎస్‌టి కాలనీకి నీళ్ల లేక యానాదులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సిసి రోడ్లు, శ్మశాన వాటిక లేవు. గ్రామం నుంచి చుండి మండల స్కూలుకు 150మంది పిల్లలు వెళ్తున్నారు. తమ గ్రామం నుంచి చుండి వెళ్లే 3 కి.మీ.ల రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది.. గ్రామంలో డ్రైనేజీలు లేక వర్షపునీరు రోడ్లపైకి చేరుతోం ది గ్రామంలోని కొత్తచెరువు ఆక్రమణలకు గురైంది..మీరు అధికారంలోకి వచ్చాక మా గ్రామ సమస్యలు పరిష్కరించాలి ' అని కోరారు. దీనిపై నారా లోకేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామసీమలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యా యన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ కుళాయి అందజేసి, 24/7 తాగునీరు అందిస్తామన్నారు. ఇతర మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని హామీనిచ్చారు.



లోకేష్‌తో మాట్లాడుతున్న మహిళలు

లోకేష్‌ను కలిసిన రామచంద్రపురం గ్రామస్తులు

మండలంలోని రామచంద్రపురం గ్రామప్రజలు లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.తమ గ్రామంలో ఎంపియుపి స్కూలుకు కాంపౌండ్ వాల్ లేదు. స్కూలు పిల్లలకు తాగడానికి మంచినీరు లేదు.మా గ్రామం నుండి చుండి మోడల్ స్కూలుకి అంకభూపాలపురం మీదుగా రోడ్డువేయాలని కోరారు. లోకేష్ మాట్లా డుతూ...గత నాలుగేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయిం దన్నారు. నాడు-నేడు పేరుతో వేలకోట్ల దోచుకున్న జగన్ అండ్ కో స్కూలు భవ నాలకు ప్రహరీగోడలు, మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం దారుణ మన్నారు.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే టీచర్ పోస్టులు భర్తీచే యడమే గాక స్కూళ్లలో సకల సదుపాయాలు కల్పిస్తాం.రామచంద్రపురం చెరువుకట్టను పటిష్టం చేస్తాం, శ్మశానికి స్థలం కేటాయిస్తాం.. లింకు రోడ్ల నిర్మాణం చేపడతామని లోకేష్ హామీనిచ్చారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రూ 6.15 కోట్లతో కాపు భవన్ ప్రారంభం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : రాష్ట్రంలోని అన్ని వర్గాలతో పాటు కాపుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాపుల అభ్యున్నతికి ఎంతో కషి చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో రూ. 6.15 కోట్ల తో నూతనంగా నిర్మించిన కాపు భవన్‌ను ఆయన ప్రారం భించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న కాపులకు కూడా కాపు నేస్తం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని చెప్పారు. రాజకీయ పదవుల్లో కూడా కాపులకు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాపుల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో, ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అతి పెద్ద సామాజిక వర్గం కాపు సామాజిక వర్గమన్నారు. దక్షిణ భారతదేశంలో కాపు సామాజిక వర్గం బాగా విస్తరించిందని, ఈ సామాజిక వర్గం సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కాపులు అంటే దేశ సంరక్షణకు కాపు కాసేవారని, వివాదాలకు దూరంగా ఉంటారని, పరిపాలన, వ్యాపారం, వ్యవసాయం రంగాల్లో రాణిస్తూ, సమాజంలో ఏకతాటిపై ఉంటూ అందరినీ కలుపుకొని ముందుకెళ్తారన్నారు. కాపులందరూ ఐకమత్యంగా నెల్లూరు జిల్లాలో కాపు భవన్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో బీసీ భవన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ,పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం హరినారాయణన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వికాస్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరిబాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి, సన్నపురెడ్డి పెంచల రెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి, జిల్లా కాపు సంఘ నాయకులు పిండి సురేష్, సిరి శ్రీనివాస్, భూపతి విజయ, రాఘవ, ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కాపు భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు అంబటి రాంబాబు, కాకాణి

నిలిచిన లావాదేవీలు

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు పోస్టల్ కార్యాలయంలో పరికరాలు కాలిపోయి కంప్యూటర్లు పనిచేయకపోవడంతో లావాదేవీలు స్తంభించి పోయాయి. దీంతో పోస్టల్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. నెలరోజుల క్రితం ఇన్వాటరు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో కంప్యూటర్లు మోరాయించి నందున రికరింగు డిపాజిట్లు, బీమా పథకాలు, ఫిక్స్ డిపాజిట్లు తదితర వసతులు ఆగిపోవడంతో గుడ్లూరు బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఉన్న వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతుల కోసం ఒంగోలు నుంచి రావలసిన మెకానికులు, ఇంజనీర్లు రోజులు తరబడి రాకపోవడంతో ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నగదు లావాదేవీలు సైతం ఆగిపోవడంతో పోస్టులు వినియోగదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేయాలని పోస్టల్ వినియోగదారులు పోస్టల్ ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్యాచ్ ఆఫ్ లా రూల్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిజర్వేషన్, ఉద్యోగోన్నతులు కల్పించే సమయంలో అనుసరిస్తున్న క్యాచ్ ఆఫ్ లా రూల్‌ను రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం దర్గామిట్ట ప్రాంతంలోని ఎంసియుపిఎస్ పాఠశాలలో బిటిఎ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బిటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న కాన్ సీక్వెన్షియల్ ప్రమోషన్ సీనియారిటీని 2021 లో 85 రాజ్యాంగ సవరణ ద్వారా జీవో నెంబర్ 26, సీసీఏ రూల్ 33 (ఏ) , సుప్రీంకోర్టు తీర్పు ద్వారా అమలు చేస్తుందన్నారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఏపీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రిజర్వేషన్ల సమీక్షకై మిడ్ లెవెల్ ఆఫీసర్స్ (ఎం ఎల్ ఓ) కమిటీ వేసి ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టును అనుసరించి క్యాచ్ ఆఫ్ రూల్ ద్వారా ఇనిషియల్ క్యాడర్ సీనియారిటీ ని ప్రమోషన్ కి పరిగణలోకి తీసు కోవాలని నిర్ణయించడం చట్ట వ్యతిరేకమన్నారు. పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యన్.నాగేంద్ర కుమార్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు నేలపాటి రఘు రామయ్య మాట్లాడారు. సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు సరికాదు



ప్రజాశక్తి-మర్రిపాడు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా నిరంతరాయంగా పనిచేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను చూసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్, పచ్చ పార్టీ నాయకులు భయపడి వలంటీర్ల ద్వారా ఉమెన్ ట్రాకింగ్ జరుగుతుందని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వైసిపి జిల్లా ఐటి వింగ్ అధ్యక్షులు కొప్పోలు వెంకటేశ్వర్లు విమర్శించారు. ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం కోసం వైసిపి సమర్థవంతంగా పనిచేయడం వల్ల ఓటమి వాళ్లకు భయంపట్టుకుందన్నారు. 2014 నుండి 2019 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి 3 కోట్ల 40 లక్షల ఓటర్ల డేటాను సేవామిత్రా యాప్ ద్వారా చోరీ చేసినప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. టిడిపి హయాంలో జరిగిన డేటా చోరీ గురించి వరల్డ్ ఎకనామిక్ ఫారం గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2019లో డేటాబేస్ నుండి ఆధార్ ఇతర డేటా దొంగిలించినట్లు తెలిసినా టిడిపి ఎందుకు స్పందించలేదని విమర్శించారు.

నేడు, రేపు 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని బాలాయపల్లి సచివాలయం పరిధిలోని దేవమ్మచెరువు పంచాయతీలో సోమ, మంగళవారాల్లో జరగబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీతారామపురం బిట్-2 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పాల్గొంటారన్నారు. జెడ్‌పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు సొసైటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు, జెసిఎస్ కన్వీనర్‌లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రోడ్డు వెడల్పు కుదింపు

- అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్న ప్రజలు



వెడల్పు తగ్గించి నిర్మించిన సిసిరోడ్డు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ఆంధ్రావారిపల్లె వెళ్లే కూడలి వద్ద ప్రస్తుతం వేస్తున్న సిసిరోడ్డు నిర్మాణం 12 అడుగులు వేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ 10అడుగులు వేయడంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విధమైన రోడ్డు నిర్మానం వల్ల భవిష్యత్తులో ఎదురుగా వచ్చే వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేసి ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కాదని తెలియజేశారు. అదీకాక, రోడ్డు నిర్మానం తర్వాత మట్టి కట్టలు కట్టారే కానీ, నీరు పోయలేదని వాపోయారు. నీరు క్యూరింగ్ కాకుంటే రోడ్డు మన్నిక తగ్గి త్వరత గతిన పగుళ్లు ఇచ్చి రోడ్డు పాడైపోతుందని తెలియజేశారు. ఈ రహదారి నుంచి దాదాపు 15 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు సులువైన మార్గమన్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు నిబంధన మేరకు 12 అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సిసి రోడ్డు నిర్మాణం జరిగే సమయంలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా ఎవరూ లేకపోవడం గమణార్హం.

నిత్యావసరాలు అందజేత



డిఆర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : డిఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళ రావు నగర్‌లోని తమ కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేలు విలువ చేసే బియ్యం, వంటింటి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ మాట్లాడుతూ డి.ఆర్. గొప్ప దార్శనికుడు అని, ఆయన ఎంతో ముందుచూపుతో కళాశాలలు స్థాపించడం వల్ల ఎందరో పేదలు, బలహీన వర్గాలు ఇక్కడ చదువుకుని దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నారన్నారు. డి.ఆర్.పేరుపై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వినయ్‌కుమార్ రెడ్డి, విద్యాధర్‌కుమార్ రెడ్డిలకు అభినందనలు తెలియజేశారు. మరోక ముఖ్యఅతిథి చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ జవహర్ భారతి పూర్వ విద్యార్థి అయినందుకు చాలా గర్వంగా ఉందన్నారు. తన వంతుగా వృద్ధులకు తమ హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యం చేస్తానన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్ రెడ్డి, సేవాసమితి చైర్ పరసన్ దొడ్ల ఆదిలక్ష్మీ, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ సింగ్, అమరావతి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

సంఘసేవకుడు మాలకొండారెడ్డి



ప్రజాశక్తి-కావలి : విద్యార్థులకు, యువతకు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తూ దేశభక్తిని పెంచుతున్న అలుపెరగని సంఘ సేవకుడు, మాలకొండారెడ్డి పలువురికి ఆదర్శ ప్రాయుడని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన క్షేత్ర ప్రచార అధికారి నాగసాయిసూరి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు ముగింపు సందర్భంగా నెల్లూరులో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయిసూరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాలకొండారెడ్డిని అభినందనలతో సత్కరించారు. మాలకొండారెడ్డి కోస్తా ప్రాంతంలోని జిల్లాలలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన సదస్సులు అలాగే ఆజాదీకా అమృత మహోత్సవ వేడుకలు సందర్భంగా మహనీయుల త్యాగాలపై అవగాహన కల్పిస్తున్నారని వారి దేశభక్తిని కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, న్యాయవాది రమాదేవి, విద్యావేత్త కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ పి.శ్రీధర్ – డాక్టర్ కె.ఝాన్సీ దంపతులు సంయుక్త సేవాసంస్థ ద్వారా సంరక్షిస్తున్న చిన్నారి "మైష" పుట్టినరోజును శనివారం రాత్రి కావలి పట్టణం క్రిస్టియన్ పేటలో ఉన్న శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కేక్ కటింగ్ చేసి, ఘనంగా పుట్టినరోజును నిర్వహించడమే కాకుండా విద్యా ఉపకరణాలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి శ్రీధర్ – డాక్టర్ కె ఝాన్సీ దంపతులు, వారి కుమారులు పి.శ్రీజనిత్, డాక్టర్ పి.శివ ప్రసాద్, సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని మైష పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు.

'జనం కోసం జనసేన' ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : అధికార పార్టీ చేసే అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, కావలిలో జరగని అభివృద్ధిని కావలి ప్రజలకు చేరేలా "పవన్ రావాలి! పాలన మారాలి!" అని నినాదంతో ఆదివారం "జనం కోసం జనసేన" కార్యక్రమం బెల్లం కొండామస్తాన్, బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభించారు. కావలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, పట్టణ అధ్యక్షులు పోబ్బా సాయివిఠల్ సూచనలతో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 32వ వార్డు కార్యకర్తలు నాయకులు పవన్ కళ్యాణ్ ఫాన్స్ వచ్చి, సంగిభావం తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, తిరుములశెట్టి సుధీర్ నియోజకవర్గ కోఆర్డినేటర్, ఆలా శ్రీనాథ్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్, గాదె నాగార్జున, పట్టణ ఉపాధ్యక్షులు, తోట శరన్, రామకృష్ణ, లక్ష్మణ్, ప్రవీణ్, మురళి, నాని, సాయి, యువత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోవూరు : మోటార్ బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన రామన్నపాలెం గేట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గండవరం ప్రాంతానికి చెందిన టింకరింగ్ మెకానిక్ జుబేర్ టింకరింగ్ పనికి అవసరమైన వెంకటేశ్వరపురం జనార్ధన్‌రెడ్డికి కాలనీకి చెందిన జావిద్‌తో కలసి నెల్లూరుకి వెళ్లారు. అక్కడ నుంచి రేకును మోటర్ బైక్ పై తీసుకువస్తున్న క్రమంలో ఆ రేకు జబ్బీర్‌కు తగలడంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో జుబేర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు, సంఘటన స్థలం చేరుకొని కేసు నమోదు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని గోపన్నపాలెం సర్పంచ్ గండు వెంకరెడ్డి కుటుంబం ఆదివారం గ్రామంలోని పోలేరమ్మ తల్లికి పొంగళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. మేకపాటికి ఎస్‌టి కాలనీవాసులు గ్రామస్తులు స్వాగతం పలికారు. వైఎస్ఆర్ విగ్రహానికి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబం అభిమానుల, బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ సోదరుడు మండల రైతు అధ్యక్షులు గండు కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి పాలూరి మాలాద్రి రెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఇంజమూరు సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, దుత్తలూరు మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, గోపన్నపాలెం వైసిపి నాయకులు గండు రఘురామిరెడ్డి, ఎదురురి మాల్యాద్రి రెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఉదయగిరి సోషల్ మీడియా కో కన్వీనర్ అంకినపల్లి నరసింహారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సుస్థిరతకు చర్యలు

- డిఆర్‌డిఎ పిడి కె వి సాంబశివారెడ్డి

ముఖాముఖి



ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సుస్థిరతకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది. ఆ క్రమంలో స్వయం సహాయక సంఘాలల్లో సభ్యులుగా ఉన్న ప్రతి మహిళకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం నిధులు జమ చేస్తుంది. ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో ఆసరా పథకంలో నిధులు మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా పథకంలో మూడవ విడత నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఈ పథకం అమలు తీరు ఏ తరహాలో నిర్వహిస్తున్నారో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కె వి సాంబశివారెడ్డి మాటల్లో..

ప్రశ్న. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేసిన వైఎస్ఆర్ ఆసరా పథకంలో ఎంత మంది లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమచేశారు.. మొదటి విడతలో ఎంత మందికి, రెండవ విడతలో ఎంత మందికి, మూడవ విడతలో ఎంత మందిని ఎంత నగదు జమచేశారు..?

జవాబు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థిక సుస్థిరత కల్పించేందుకు ప్రతి సంక్షేమ పథకంలో అవకాశం కల్పిస్తుంది. ముఖ్యంగా వైఎస్ఆర్ ఆసరా పథకంలో 2020–21లో 31,569 సంఘాలకు చెందిన 3,09,877 మందికి రూ.250.23 కోట్ల నగదును మొదటి విడతగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. రెండవ విడతగా 2021–22లో 34,323 సంఘాలకు చెందిన 3,28,646 మందికి రూ.285.18కోట్ల నగదు జమచేసింది. మూడవ విడతగా 2022–23లో 34,443 సంఘాలకు చెందిన 3,29,815 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.290.17 కోట్ల నగదు జమచేసింది.

ప్రశ్న. వైఎస్ఆర్ ఆసరా పథకంతోపాటు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు బ్యాంకుల నుంచి రుణాలు అందజేస్తున్నారా..?

జవాబు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు కార్యక్రమంలో వైఎస్ఆర్ ఆసరా పథకం అతి పెద్ద రత్నం. ఈ పథకాన్ని స్వయం సహాయక సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడుతున్నారు. ఈ పథకం ద్వారానే కాకుండా ఔత్సాహికులైన ఒకొక్క మహిళకు రూ.75 వేలు రుణంగా అందజేస్తుంది. ఈ రుణంతో చిరువ్యాపారాలైన కిరాణా షాపుల నిర్వహణ, పాడిగేదలు తదితర వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది.

ప్రశ్న. సంక్షేమ పథకాలు అమలు చేయడం.. ఆ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించడంతోపాటు వారి కుటుంబ ఆరోగ్య పరిరక్షణకు చర్యలేమైనా తీసుకుంటున్నారా..?

జవాబు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు నవరత్నాల పేరుతో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. ఈ సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించి మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. అదేవిధంగా కుటుంబ ఆరోగ్య పరిరక్షణ అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకటించిన నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు చిరుదాన్యాలు తయారు చేసేందుకు ప్రోత్సహిస్తున్నాం. అందులో భాగంగా ఇటీవల నగరంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత చెల్లింపు కార్యక్రమంలో చిరుధాన్యాల పండుగ విజయవంతంగా నిర్వహించాం.

సంక్షేమ నిధిని కార్మికులకే కేటాయించాలి



మాట్లాడుతున్న చాన్‌బాషా

ప్రజాశక్తి-బిట్రగుంట

కేంద్ర ప్రభుత్వం కార్మికుల కోసం విడుదల చేస్తున్న కార్మిక సంక్షేమ నిధులను వారికే కేటాయించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్‌కె చాన్‌బాషా పేర్కొన్నారు. బోగోలు సిఐటియు కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని మండల సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సిఐటియు ఉపాధ్యక్షురాలు ఎస్.కె.రెహానా బేగం, జిల్లా భవన నిర్మాణ కార్మికుల సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.కె.చాన్‌భాషా పాల్గొని వారు మాట్లాడుతూ 2019 సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. కేంద్రం కార్మికుల కోసం రూ.1700 కోట్లు కేటాయించినా, సంక్షేమ నిధులను పక్కదారి మళ్లిస్తున్నారని తెలిపారు. 2019 సంవత్సరం నుండి కార్మికులు కనీసం ఒకపూట తినడానికి కష్టంగా మారిందని, ఇసుక, సిమెంటు, స్టీలు ధరలు పెంచడంతో మధ్యతరగతి కుటుంబం వారు ఇల్లు కట్టలేని పరిస్థితి రావడంతో భవన నిర్మాణ పనిచేస్తున్న కార్పెంటర్లు, ఎలక్ట్రిషన్లు, ప్లంబర్లు, పెయింటర్లు, రోజు కూలి చేసుకునే కార్మికులకు పని లేక ఇళ్లల్లో వస్తువులు అమ్ముకునే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. కార్మికుల కోసం కేటాయించిన నిధులను వారి సంక్షేమానికే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాపీ మేస్త్రీల కూలి రేట్లను ఆగస్టు 1వ తేదీ నుండి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, మండల టీచర్ల సంఘం నాయకులు ఎన్.రామయ్య, మండల సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్.కె బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక నాయకులు మోహన్, క్రిష్టయ్య, తిరుపతి, కార్పెంటర్ కాలేశా, ఎస్‌కె.అన్వర్ భాషా, పొట్లూరి శ్రీనివాసులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావును కలిసిన వైసిపి నాయకులు



ప్రజాశక్తి-సీతారామపురం

రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావును ఆదివారం సీతారామపురం మండల వైసిపి నాయకులు, మాజీ మండల ఉపాధ్యక్షులైన రామిశెట్టి తిరుపతయ్య నెల్లూరులో కాపు భవన్ ప్రారంభోత్సవంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మండలంలో కాపుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన అంశాలపై శేషగిరిరావుతో చర్చించి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల కాపు సంఘం నాయకులు ఎడమ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ట్యాక్స్‌లను తగ్గించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రయివేట్ స్కూల్‌బస్సు, వ్యాను ట్యాక్స్‌లను ప్రభుత్వం విపరీతంగా పెంచడాన్ని ఖండిస్తూ, పెంచిన ట్యాక్సులను వెంటనే తగ్గించాలని అపస్మా నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని మేధా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రయివేట్ పాఠశాలల ఆత్మకూరు నియోజకవర్గం అధ్యక్షులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్ వ్యాను, బస్‌ట్యాక్స్‌లను ఒక్కసారిగా నాలుగు రెట్లు పెంచారని, దీనివల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలియజేశారు. ఈ నిర్ణయం బస్సులు, వ్యాన్లు, ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలకు ప్రతి సంవత్సరం నష్టాలు కలుగజేస్తుందన్నారు. కాబట్టి మీరు మళ్లీ ట్యాక్సులు పెంచితే ఇంత ఆర్థికభారంతో నిరుద్యోగ బాధతో స్వతంత్రంగా బతకాలని ఏర్పాటు చేసుకున్న ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు గత సంవత్సరం 51 సీట్ల బస్సు ట్యాక్స్ రూ.5690 ఉండగా ప్రస్తుతం పెరిగిన ట్యాక్స్ రూ.23160 పెరిగిందన్నారు. రవాణా శాఖ మంత్రి తక్షణమే ఈ ట్యాక్స్‌లను తగ్గించి ప్రయివేట్ పాఠశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం జి.ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వి.రమణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు టి.సి.సుబ్బయ్య, ఆత్మకూరు నియోజకవర్గం ట్రెజరర్ కోటేశ్వర్ రెడ్డి, రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు నాయుడు, శ్రీనివాస స్కూల్ కరస్పాండెంట్ సురేష్‌బాబు, లిటిల్ ఏంజెల్ స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

'యువగళం' ఓ చరిత్ర..



ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన 'యువగళం' పాదయాత్ర జిల్లా చరిత్రలో నిలిచిపోతుందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో టిడిపి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అపూర్వస్పందన లభించిందన్నారు. జిల్లాలో జరిగిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని గతంలో జిల్లాలో ఏ రాజకీయ నాయకుడు చేయనివిధంగా పది నియోజకవర్గాల్లో నడిచిన ఏకైక యువనాయకులు నారా లోకేష్ మాత్రమేనని తెలిపారు. ప్రజల్లో వచ్చిన ఆదరణ చూసి వైసిపి నాయకులు తమ ఓటమి తప్పదని లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఒక్కసారి అవకాశం అని జగన్మోహన్ రెడ్డికి ఓటు వేసి తప్పు చేశామని భావించి యువగళం పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారని గుర్తుచేశారు. జిల్లాలో ఇప్పుడు ఎన్నికలు వచ్చినా 10కి 10 స్థానాలు టిడిపి కైవసం కావడం తప్పదని జోస్యం చెప్పారు. వైసిపి నాయకులు ఎన్ని విమర్శలు చేసినా, ప్రజలు నమ్మరని రాబోవు ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని యువగళం పాదయాత్ర జిల్లా చరిత్రలో నిలిచిపోతుందని ఆ గొప్పదనం నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు.

లోకేష్‌కు జ్ఞాపిక అందజేత



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : టిడిపి యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి నెల్లూరు జిల్లా వీడ్కోలు కార్యక్రమంలో టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ తన కుటుంబంతో నారా లోకేష్‌ను కలిసి తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్ జ్ఞాపికను తన కుటుంబ సభ్యులు అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీ భవిష్యత్తు మా బాధ్యత అని నారా లోకేష్ హామీనిచ్చారు.

చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు నియోజకవర్గంలోని పెద్ద పరిశ్రమగా ఉండి, మూతపడిన చక్కెర కర్మా గారాన్ని పునరుద్ధరణ చేయాలని జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం స్థానిక ఎంఎల్ఎ దిష్టి బొమ్మను సుగర్ పరిశ్రమ వద్ద దగ్ధం చేసి, కోవూరులో ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. రైతులు ప్రమేయం లేకుండా సుగర్ పరిశ్రమను మూతవేసి షేర్ హోల్డర్ రైతులకు మొండి చేయి చూపారన్నారు. నెల్లూరు జిల్లాలో అతిపెద్ద పరిశ్రమగా 50ఏళ్లకు పైబడి ఉందన్నారు. దీని ద్వారా చాలా మంది ఉపాధికి లోటు లేదని, ఇది మూత పడడంతో ఇక్కడ పని చేసే కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. ఇప్పటికైనా కోవూరు ఎంఎల్ఎ ప్రసన్నకుమార్ రెడ్డి స్పందించి ప్రభుత్వం ద్వారా సుగర్ పరిశ్రమను పునరద్ధంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోవూరులో ఇసుక, గ్రావెల్ మాఫియాకు అడ్డాగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్, జనసేన నాయకులు, కార్యదర్శి బద్దెపూడి ప్రశాంత్, నిర్మల, చిన్న రాజా, ప్రసన్న, కేశవ, షారు, సాయి, పార్థు, మోనిష్, వర్షన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

ప్రజాశక్తి-అనంతసాగరం

జాతీయ రహదారి నెంబర్ 67 నిర్మాణంలో 150 ఎకరాల భూమిని కోల్పోతున్న మండలంలోని అగ్రహారం, బొమ్మరం, ఆమని చిరివెళ్ల, ఇనగలూరు, బెడుసుపల్లి రెవెన్యూ గ్రామాలలోని చిన్న, సన్నకారు రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పాత దేవరాయపల్లి గ్రామంలో జాతీయ రహదారి 67 భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.10 నుండి రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతులకు జీవనోపాధిగా ఉన్న భూమి కోల్పోతూ తమ కుటుంబాలు జీవితాంతం ఆర్థికంగా, సామాజికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతారని తెలిపాపారు. కావున అధికారులు న్యాయంగా రైతులకు రివార్డు ప్రకటించాలని కోరారు. అనంతరం జాతీయ రహదారి 67 భూ నిర్వాసితుల పోరాట కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. భూ నిర్వాసితుల పోరాట కమిటీ గౌరవ అధ్యక్షులుగా మంగళ పుల్లయ్య, అధ్యక్షులుగా సంగన కృష్ణారెడ్డి, కార్యదర్శిగా ఎస్‌కె. సాదిక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా, భూ నిర్వాసితుల రైతులు గువ్వల ప్రసాద్ రెడ్డి, రెడ్డిమల్ల ప్రభాకర్‌రెడ్డి, యనమల కృష్ణారెడ్డి, సత్తార్, గండి కోట పెంచలయ్య, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

నిరంతర శ్రమతోనే రాజ్యాధికారం

- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి



మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బహుజనులంతా నిరంతర శ్రమతోనే రాజ్యాధికారం సాధించగలమని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని నేతాజీ క్లబ్ ప్రాంగణంలో బిఎస్‌పి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్షీరామ్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నందా ఓబులేసు మాట్లాడుతూ బిఎస్‌పి దాని నిర్మాణం ఇప్పుడు ఉన్న డబ్బు అధికారం ప్రలోభాలకు అధికార పార్టీలకు ధీటుగా మన పార్టీని సంస్థాగతం చేసుకుంటూ నిర్మాణ దశగా తీసుకోవడం వల్లే ఈ క్రమంలో భాగంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న బహుజన సమాజ్ పార్టీ ప్రతి కార్యకర్త గ్రామాల్లో తిరిగి పార్టీని బలోపేతం చేయడం రాబోయే ఎన్నికలలో పార్టీని ఒడ్డుకు చేర్చడమే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి మాట్లాడుతూ కార్యకర్తకు నాయకులకు ఉండాల్సిన లక్ష్యం విశ్వాసంతో పని చేయాలన్నారు. ఆ విశ్వాసాన్ని సాధించే దృక్పథం ఉండాలన్నారు. పట్టుదల ఉంటే కాదు నిరంతరం శ్రమ ఉండాలని తెలిపారు. కాన్షీరాం నిరంతరం శ్రమించే వ్యక్తి ఆయనే బహుజన సమాజ్ పార్టీని స్థాపించారని తెలిపారు. క్రిస్టియన్, మైనార్టీలు, బహుజనులు ఈ బహుజన సమాజ్ పార్టీ ఈ దేశంలో ఉన్న 80శాతం ఉన్న బహుజన సమాజాన్ని రాజ్యాధికారం తీసుకురావడానికి ఈ బహుజన సమాజ్ పార్టీని స్థాపించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థిగా నందా ఓబులేసును పోటీ చేసేందుకు సంసిద్ధం చేస్తున్నామని, ఆయన్ను గెలిపించేందుకు కార్యకర్తలందరూ కృషి చేసి చట్టసభల్లోకి పంపాలన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు పుష్పాంజలి, జిల్లా ఇన్‌ఛార్జి శ్రీరామ్, నియోజకవర్గం అధ్యక్షులు నందా ఓబులేసు, నియోజకవర్గం ఇంచార్జ్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోతి శ్రీనివాసులు, సింగరాజు తదితరులున్నారు.

బిఎస్‌పి ఆధ్వర్యంలో కేడర్ క్యాంప్

ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరిలో ఆదివారం స్టేట్ బ్యాంకు పైన ఉన్న చేరెడ్డి పెద్దిరెడ్డి కళ్యాణ మండపంలో బిఎస్‌పి ఉదయగిరి నియోజకవర్గ కేడర్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు బాక్కా పరంజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే, కాన్షీరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బాక్కా పరంజ్యోతి మాట్లాడుతూ బిఎస్‌పి భారతదేశంలోనే అతిపెద్ద 3వ పార్టీ అని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో 4సార్లు అధికారంలోకి వచ్చిందని, 80 శాతం ఓట్లు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీలందరూ కలిసి పోరాడితే ఎపిలో రాజ్యాధికారం సాధించగలమని తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓటు విలువ గురించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షీరాం సిద్ధాంతం గురించి చేసిన పోరాటాల గురించి వివరించారు. రాబోవు 2024 ఎన్నికల్లో బిఎస్‌పిని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాజ్యాధికారం లక్ష్యంగా ప్రతిఒక్కరూ తనవంతుగా కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు "పరంజ్యోతి" జానకి ప్రసాద్, శ్రీరామ్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్, జిల్లా నియోజకవర్గ ఇన్‌ఛార్జి క్రాకుటూరి పుష్పాంజలి, జిల్లా ఇన్‌ఛార్జి బి.శ్రీరామ్, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కర్ర గోపాల్, మండల అధ్యక్షులు ఎలికా వెంకటరమణయ్య, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్వేటమ్మ సేవలో ఎంఎల్ఎ ప్రసన్న

ప్రజాశక్తి-కొడవలూరు

కొడవలూరులో కొలువు దీరిన ఆర్వేటమ్మ వారిని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆదివారం దర్శించుకొన్నారు. గ్రామ దేవత ఆర్వేటమ్మ వారికి రెండ్రోజులపాటు అత్యంత వైభవంగా తిరునాళ్ల నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా అలంకారంతో ఉన్న అమ్మవారిని ఎంఎల్ఎ దర్శించుకుని ఈ సందర్భంగా నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు. వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు నల్లవుల శ్రీనివాసులు, దేవరబోయిన శివకుమార్, మందపల్లి మల్లికార్జున, పొబ్బా రవి, ఉదయ్, ఎన్.నాగేశ్వర రావు, కే.నాగేశ్వరరావు, పి.మురళీ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలం లోని ప్రభుత్వ పాఠశాల ల్లో 2022–23 విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నగదు బహుమతి దాత తెలుగు భారతి సేవాసమితి గౌరవ సలహాదారు సోమవరపు యానాదిరెడ్డి, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వర రెడ్డిల చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, బాలికల విభాగంలో రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు మొత్తం రూ.90 వేల బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ప్రభుత్వ జిల్లా వైద్యశాల ఆత్మకూరు నిత్య అన్నదాన కంచి పరమేశ్వర్ రెడ్డి, కంచి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి వారి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు భారతి సేవా సమితి సోమవారపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు గోవిందరెడ్డి, సహాధ్యక్షులు కొల్ల వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి రవీంద్ర కుమార్, వెలిశెట్టి నారాయణరావు తదితరులున్నారు.



బూత్ ఏజెంట్లతో సమావేశం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ సమావేశంలో టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి బూత్ లెవెల్ ఏజెంట్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన క్రియాశీలక పాత్రపై చర్చించారు. ఎక్కడా ఏలాంటి భయాందోళనకు గురికాకుండా ఎన్నికల సమయంలో పనిచేయాలని సూచించారు.

ఇసుక రీచ్ వద్ద నిరసన

- సిఐ రామకృష్ణారెడ్డి చొరవతో టిప్పర్లు విడుదల



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని పల్లిపాడు ఇసుక రీచ్ వద్ద ఆదివారం గ్రామస్తులు నిరసనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ సమీపంలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేదంటూ పల్లిపాడు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రీచ్‌వద్ద సుమారు మూడు గంటలపాటు టిప్పర్లను, ట్రాక్టర్లను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి స్థానిక ఎస్ఐతో పాటు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఇసుక రీచ్ అనుమతులుంటే చూపాలని లేనిపక్షంలో జెసిబిలను, టిప్పర్‌లను సీజ్ చేసి వాటిపై కేసునమోదు చేయాలని గ్రామస్తులు సిఐతో వాదనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పల్లిపాడులో ఇసుక రీచ్‌కు అనుమతులు లేవని, నాగరాజుతోపు గ్రామంలో అనుమతి పొంది తమ గ్రామంలో ఇసుకను యథేచ్ఛగా తీసుకెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి గత సంవత్సరం వచ్చిన వరదల్లో భారీ నష్టం వాటిల్లిందని, ఇదేవిధంగా ఇసుక తవ్వకాలు కొనసాగితే రాబోయే రోజుల్లో తమ గ్రామం పూర్తిగా పెన్నానదిలో కలిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెసిబిలతో 20 అడుగుల మేర గుంతలతో లోడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. పలుమార్లు కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులకు అర్జీల రూపంలో విన్నవించుకున్న ఏ అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో తిరగడం వల్ల పల్లిపాడు రోడ్లు అద్వానంగా తయారయ్యాయన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రీచ్ ఉండాల్సిన నాగరాజు తోపు గ్రామం నుండి ఇసుకను రవాణా చేయాలని కోరారు. సిఐ రామకృష్ణారెడ్డి జోక్యంతో గ్రామస్తులు సర్దుమనిగారు. టిప్పర్లను ట్రాక్టర్లను విడుదల చేశారు.

డైట్ కాలేజీలో ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఇందుకూరుపేట మండలం ప్రభుత్వ డైట్ కాలేజ్‌లో 1992–93 టిటిసి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పల్లిపాడులో ప్రభుత్వ డైట్ ఆవరణలో 1992–93 విద్యా సంవత్సరంలో టి.టి.సి. చదివిన పూర్వ విద్యార్థుల (అలుమ్ని) ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఆహ్లాదకరంగా జరిగింది. ఈ రీ-యూనియన్ వేడుకకు అప్పట్లో శిక్షణ పొందిన సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిత దివంగతులైన అధ్యాపకులు, విద్యార్థుల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. తర్వాత పూర్వ ఉపన్యాసకులను పుష్ప మాలలు, దుశ్శాలువలు,పండ్లు, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. గుండాల నరేంద్ర బాబు, కృష్ణయ్య, సుబ్బారావు అధ్యక్షతలో కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ వారి కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యులు మల్లికార్జున, శివప్రసాద్, నారాయణ, పూర్వ అధ్యాపకులు శ్రీనివాసరావు, పి.ఎల్.రావు, జ్యోత్స్న, జలనీపాషా, భాస్కర్ రెడ్డి, నాగభూషణం, సజీవిని, నర్సింహారెడ్డి, పూర్వపు ప్రిన్సిపాల్ కుమారరావు, పి.శ్రీధర్‌బాబు, ప్రస్తుత డైట్ ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కె.విజయచంద్ర పాల్గొన్నారు.